క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ శ్యాంసుందర్ మండలానికి చెందిన 46 మంది లబ్ధిదారులకు రూ.46 లక్షల విలువగల కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నయబ్ తహసీల్దార్ హీరాలాల్, ఎంఆర్ఐలు శ్యాంసుందర్‌రెడ్డి, నూర్‌సింగ్, బాపురావ్, జూనియర్ అసిస్టెంట్ కరుణకర్‌రెడ్డి, ప్రవంతి, గంగారెడ్డి, ఆశన్న, రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా శబరిమాత ఆలయ వార్షికోత్సవం



పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామంలో శుక్రవారం శబరిమాత ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రధాన విధులగుండా అమ్మవారి పాదుకలతో పల్లకి ఊరేగించారు. మహిళలు, భక్తులు భజన సంకీర్తణలతో నృత్యం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన నిర్వహించారు.

'చలో ఆదిలాబాద్ విజయవంతం చేయండి'

ఆదిలాబాద్‌రూరల్: భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 11న చేపట్టనున్న చలో ఆదిలాబాద్ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు అన్ని సంక్షేమ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల జీవన స్థితిగతుల్లో మార్పులు తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. కార్మికుల సంక్షేమ బోర్డును బలోపేతం చేయాలన్నారు. ప్రతీనెల రూ.5వేల పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు.

హరినామ సప్తాహం ప్రారంభం

ఇచ్చోడ: మండలంలోని నర్సాపూర్‌లో అఖండ హరినామ సప్తాహం కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. కార్యక్రమంలో లాతురీకార్ కిషోర్ మహరాజ్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఇసుక వేలం

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం శివారులో పెన్‌గంగ నది నుంచి ఇసుకను తవ్వి అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను ఇటీవల భీంపూర్ మండల తహసీల్దార్ నలందప్రియ సీజ్ చేశారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్ఐ రాందాస్ సీజ్ చేసిన ఇసుకను తహసీల్దార్ సమక్షంలో వేలం వేశారు. కపిల్ అనే వ్యక్తి రూ.1లక్ష 11వేలకు సీజ్ చేసిన ఇసుకను వేలంలో దక్కించుకున్నాడు.

అనారోగ్యంతో సాకెర మాజీ సర్పంచ్ మృతి

బోథ్: సొనాల మండలంలోని సూర్యనగర్ గ్రామానికి చెందిన సాకెర మాజీ సర్పంచ్ మీరాబాయి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కాగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భౌతికాయానికి నివాళులర్పించారు. ఆమె మృతి తీరని లోటని అన్నారు.

'మద్యం సేవించి వాహనాలు నడపవద్దు'

ఇచ్చోడ: మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఆర్టీసీ సేఫ్టీవార్డెన్ ఫ్రేంసింగ్ అన్నారు. శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని బస్టాండ్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేయవద్దని, నిబంధనలు పాటించాలని సూచించారు.

పరామర్శ

కై లాస్‌నగర్: ఆపెండిక్స్ ఆపరేషన్ చేయించుకుని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో కొలుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అర్దాంగి రమేశ్‌ను సీపీఐ నాయకులు శుక్రవారం పరామర్శించారు. కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిల్క దేవిదాస్, కుంటాల రాములు, ఎస్.అరుణ్ కుమార్, ముజీబ్‌లు రిమ్స్ ఆసుపత్రికి చేరుకుని ఆయనను పరామర్శించారు.

ఘనంగా రమాబాయి జయంతి

- నివాళులర్పించిన ఆయా సంఘాల నాయకులు



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: రమాబాయి అంబేడ్కర్ 127వ జయంతిని మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ లండన్‌లో చదువుతున్న సమయంలో రమాబాయి పస్తులున్నారని, బాగా చదివి దళితుల అభ్యున్నతి కోసం కష్టపడేందుకు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మేకల మల్లన్న, ఎలుక రాజు, పాశం రాఘవేంద్ర, బోండ్ల వెంకటస్వామి, మాదాసు అర్జున్, చంటి, రవి, బోండ్ల భూమన్న, నర్సింలు, రాములు, పతిహర పోశెట్టి, ప్రభాకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: రమబాయి అంబేడ్కర్ జయంతి శుక్రవారం మండల కేంద్రంలోని త్రీరత్న బుద్ధ విహార్ వద్ద ఘనంగా నిర్వహించారు. మహా మాయ ఉపాసిక సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. రమాబాయి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, కామ్‌రాజ్ వాగ్మరే, ఉత్తం కాంబ్లే, లహుదాస్ సవంత్, మస్కే రాజువర్ధన్, సందీప్, జితేందర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



నార్నూర్‌లో..

నార్నూర్: నేటి మహిళలకు ఆదర్శం రమాబాయి అంబేడ్కర్ అని, ఆమె ఆశయాలను కొనసాగించాలని అంబేడ్కర్ యూత్ అసోసియేషన్, మాల మానాడు జిల్లా ఉపాధ్యక్షుడు లోకండే చంద్రశేఖర్, రమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు దుర్గే రుక్మబాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద అంబేడ్కర్ యూత్ అసోసియేషన్, రమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో ఆమె జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు బలహీనులకు ఉన్నతస్థాయి ఎదగడానికి రమాబాయి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ నాయకులు సునీల్ చాలూర్కర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వాంకిడి గ్రామంలో పర్యటించారు. మస్జీద్‌లో ఎమ్మెల్యేను మైనార్టీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. మైనార్టీల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలన్నింటికి పరిష్కారం చూపుతానని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ రాజు, నేరడిగొండ మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. లక్ష్మీపూర్, గుత్పాల, యాపల్‌గూడ గ్రామాలకు చెందిన ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



బిల్లు ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

నార్నూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద మాలలు శుక్రవారం ఆందోళనకు దిగారు. బిల్లు సంబంధించిన ప్రతులు దహనం చేశారు. మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు లోకండే చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితజాతిపై కుట్ర చేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ఉపసంహరించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళ నాయకురాలు దుర్గే రుక్మాబాయి, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు చాలూర్కర్ సునీల్, మాయాబాయి, నిర్మల పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. దీంతో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మొదటి రోజున ధ్వజారోహణం, అర్చన, హోమం, అగ్నిప్రతిష్ఠ పూజలు చేయనున్నారు. చివరి రోజున సోమవారం వేంకటేశ్వర స్వామి, లక్ష్మీదేవి కల్యాణాన్ని వైభవంగా జరపనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు నందయ్య కోరారు.



ముస్తాబైన వేంకటేశ్వర స్వామి ఆలయం

వేతనాలు విడుదల చేయాలని వినతి

నార్నూర్: ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా డాక్టర్ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. సదరు కాంట్రాక్టర్ ను అడిగితే ప్రభుత్వం నుంచి గత ఏడు నెలలుగా బిల్లు రావడం లేదని సమాధానం చెబుతున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బిల్లులు చెల్లించి వేతనాలు మంజూరయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు దుర్వ పాపయ్య, మెస్రం నాందేవ్, ఉపేందర్, అజయ్, పార్వత, సతిక, జమున, సుమిత్ర పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

బోథ్: సొనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, ఈవ్ టీజింగ్, ఫొటో మార్ఫింగ్, సోషల్ మీడియా పట్ల జాగ్రత్తలను వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే 100, 1930లకు ఫోన్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో షీటీం ఏఎస్సై సునీత, హెడ్‌కానిస్టేబుల్ సుశీల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సచిన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ: మండలంలో ఇచ్చోడ, నర్సాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఇచ్చోడ ఇన్‌చార్జి ఏఈ రాజు శుక్రవారం తెలిపారు. రెండు సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బోథ్: మండల కేంద్రంతో పాటు పొచ్చెర విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోదారులకు సహకరించాలని కోరారు.

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం కైలాస్‌నగర్‌లో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈనెల 8వ తేదీన పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ టౌన్- 3 ఏఈ ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్, ఏరోడ్రమ్, శాంతినగర్, కై లాస్‌నగర్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

హామీలు వెంటనే అమలు చేయాలి

ఎదులాపురం: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.వెంకట్ నారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 20న పార్టీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో హామీల అమలు చేయలేదన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సుభాష్, దేవిదాస్, ప్రసాద్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, మారుతి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

తలమడుగు: యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంఈవో వెంకట్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు బ్లూ భీం యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, మురళీధర్, సుమలత, ప్రేమేందర్, మామిడి అశోక్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని 12వ వార్డు పరిధిలో శ్రీనగర్ కాలనీలో నిర్మించనున్న శ్రీరాధకృష్ణ ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న శుక్రవారం భూమి పూజ చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ లమధ్య ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. నాయకులు నారాయణ, కలీం, లక్ష్మణ్, సంతోష్, విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతిలో ప్రవేశాలు, 7 నుంచి 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతిలో 100 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అధికారులకు సన్మానం

బోథ్: సొనాల మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన మండల తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు గ్రామస్తులు శుక్రవారం శాలువాతో సత్కరించారు. తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీవో రాజేశ్వర్‌తో పాటు సిబ్బందిని సన్మానించారు. గ్రామాభివృద్ధికి గ్రామస్తుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. మాజీ సర్పంచ్ చెట్లపెల్లి సదానందం, సకారాం, జీవన్ కుమార్, సుధీర్ రెడ్డి, చిన్నయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ఆదిలాబాద్: పుస్తక పఠనాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి శుక్రవారం విద్యార్థులను సందర్శనకు తీసుకువచ్చారు. విద్యార్థులు లైబ్రరీ విధి విధానాలు , పుస్తకాలను గురించి అడిగి తెలుసుకున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ వంటి వివిధ భాషలకు చెందిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. గ్రంథాలయాలకు తరచూ వస్తూ పఠనాభిలాషను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రఘుగణపతి, తెలుగు విభాగం అధ్యాపకులు రేఖ, నరేశ్, అనిత, సంతోషిని, పూనం, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కోసం ఉట్నూర్‌కు

- తీవ్ర ఇబ్బంది పడుతున్న గర్భిణులు
- పట్టించుకోని అధికారులు

నార్నూర్ : ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా చర్యలు తీసుకున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో వారికి శాపంగా మారుతున్నాయి. గిరిజనులకు మెరుగైన సౌకర్యం అందించాలని ఉద్దేశంతో నార్నూర్ మండల కేంద్రంలో సీహెచ్‌సీ 30 పడకల ఆసుపత్రి ప్రారంభించారు. అన్ని రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ ఆస్పత్రిలో ఫిజీషియన్స్, టెక్నీషియన్స్ లేక వారికి వైద్య సేవలు అందడం లేదు. గత ఏడాది ఆసుపత్రిలోనే గర్భిణులకు స్కానింగ్ సౌకర్యం కల్పించి ఆదిలాబాద్ రిమ్స్ నుంచి ప్రత్యేక ఫిజీషియన్ రప్పించారు. అయితే ప్రస్తుతం గర్భిణులను ఉట్నూర్ ఆసుపత్రికి తీసుకెళ్లి స్కానింగ్ చేస్తున్నారు. దీంతో రానుపోను మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో భయాందోళనకు గురవుతున్నారు. నార్నూర్ నుంచి ఉట్నూర్‌కు 22 కిలో మీటర్లు, గాదిగూడ నుంచి ఉట్నూర్ వెళ్లాలంటే దాదాపు 80 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దీంతో గర్భిణులు వైద్య పరీక్షలకు, స్కానింగ్ కోసం ఉట్నూరు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి నార్నూర్ సీహెచ్‌సీలోనే స్కానింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

ఆలయంలో లలితా సహస్ర పారాయణం



లలితా సహస్ర పారాయణం చేస్తున్న మహిళలు

బోథ్: మండల కేంద్రంలోని కొట్లాల పోచమ్మ ఆలయంలో శుక్రవారం మహిళలు లలితా సహస్ర పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి అనుగ్రహం గ్రామస్తులపై ఉండాలని కోరుకున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

బేల(జైనథ్): జైనథ్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయాన్ని శుక్రవారం తెలంగాణ కబడ్డీ అసోసియేషన్స్ కార్యదర్శి జగదీష్‌రెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకులు సంపత్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రుకేష్‌రెడ్డి, అంతర్జాతీయ కబడ్డీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, పార్థసారథి పాల్గొన్నారు.

హర్షవర్ధన్‌రెడ్డికి టీయూటీఎఫ్ మద్దతు

కైలాస్‌నగర్: నల్గొండ, ఖమ్మం, వరంగల్ మండలి నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డికి టీయూటీఎఫ్ సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మ లచ్చిరాం, పి.రఘునందన్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆయన గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది, రోడ్డు వెడల్పు కారణంగా సంబంధిత కాంట్రాక్టర్ నూతనంగా బీటీరోడ్డు వేశారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా విద్యుత్ స్తంభం రోడ్డు మధ్యలోకి వచ్చింది. అయినా.. అధికారులు తొలగించ లేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురైయ్యే అవకాశం ఉంది. – ఇచ్చోడ

సమ్మెకు సిద్ధమవుతున్న టోల్‌ప్లాజా కార్మికులు

బేల(జైనథ్): జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామ శివారులోని జాతీయ రహదారి టోల్‌ప్లాజా కార్మికులు సమ్మెకు సద్ధమవుతున్నారు. శుక్రవారం కొత్తగా సంస్థ 60 మందిని తీసుకోవడంపై సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. వారిని విధుల్లోకి తీసుకుంటే నిరవధిక సమ్మె చేస్తామన్నారు. వీరి నిరసనకు సీఐటీయూ నాయకులు టోల్‌ప్లాజా వద్ద జెండా ఆవిష్కరించి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్, సిబ్బంది ప్రభాకర్, రమేశ్, ప్రశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మికులు

ధ్యాన్ మందిర్ వార్షికోత్సవం

ఇంద్రవెల్లి: మండలంలోని హర్కపూర్‌ఆంధ్‌గూడ గ్రామంలో శ్రీ సంత్ సద్గురు పూలాజీబాబా ధ్యాన్ మందిర్ 18వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముందుగా ప్రత్యేక పూజల మధ్య ధ్వజారోహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన బృందం సభ్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పూలాజీబాబా చిత్రపటానికి నివాళులర్పించనున్నారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, మాజీ సర్పంచ్ కుడే కైలాస్, గ్రామ పెద్దలు మస్కే భరత్, డాకురే ఆత్మరామ్ పాల్గొన్నారు.



ధ్వజారోహన కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు